చెరువులో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి

తుమిందపాలెంలో విషాద ఛాయలు

యాదమరి మండలంలోని కీనాటం పల్లె పంచాయతీలోని కొత్తచెరువులో నీట మునిగి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. వేసవి సెలవుల్లో బంధువుల ఇంటికి వచ్చిన చిన్నారులు నీటి మునిగి మృతి చెందడంతో బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ఆ గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.. (వార్త మెయిన్‌లో)

చిన్నారుల మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు

సంక్షేమానికి బహుదూరం !

- అంగన్‌వాడీలకు సాధికార సర్వే శాపం
- పథకాలు వర్తింపజేయాలని వినతి
- అమలు కాని ఎన్నికల హామీలు
- అయోమయంలో అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - ఎస్‌ఆర్ పురం : ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెడుతున్న సంక్షేమ ఫలాలు అంగన్‌వాడీలకు అందడం లేదు. గత ప్రభుత్వం చేపట్టిన సాధికార సర్వే వారికి శాపంగా మారింది. అప్పటి ప్రభుత్వం వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఓ జీవో తెచ్చింది. అయితే ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ ఫలాలు వర్తింప చేస్తామని హామీ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తోంది. ఇంత వరకు అతీగతీ లేదు. దీంతో అంగన్‌వాడీల యూనియన్ ద్వారా వారి నిరసనను రాష్ట్ర ప్రభుత్వానికి తెలుపుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో కార్వేటి నగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో కార్వేటినగరం, ఎస్ఆర్ పురం, వెదురు కుప్పం మండలాలు ఉన్నాయి. ఈ కార్వేటినగరం ప్రాజెక్టు పరిధిలో మొత్తం 161 మెయిన్ సెంటర్లు ,40 మినీ సెంటర్లు ఉన్నాయి. వెదురుకుప్పంలో 57 మెయిన్ సెంటర్లు, 15 మినీ సెంటర్లు, ఎస్ఆర్ పురంలో 49 మెయిన్ సెంటర్లు, 13 మినీ సెంటర్లు, కార్వేటినగరంలో 55 మెయిన్ సెంటర్లు, 12 మినీ సెంటర్లు ఉన్నాయి. కార్వేటినగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం 201 అంగన్ వాడీ సెంటర్లు లకు 160 మంది కార్యకర్తలు, 41 మంది హెల్పర్లు ఉన్నారు. అయితే అప్పటి ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులని హామీ ఇచ్చింది. కానీ ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ఓ జీవో తీసుకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలకు అర్హులే అని అంగన్‌వాడీ కార్యకర్తలకు , హెల్పర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని ఓ జీవో అమలు చేసింది. కానీ అర్హులైన వారు సచివాలయాలలో ప్రభుత్వ పథకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటుంటే అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ప్రభుత్వ ఉద్యోగులే అని సంక్షేమ పథకాలకు అనర్హులు అని అధికారులు చెబుతున్నారు.

అంగన్‌వాడీలకు సాధికారి సర్వే శాపం

సాధికార సర్వేలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ప్రభుత్వ ఉద్యోగులే అని గుర్తించడంతోనే ఈ పథకాలు తమకు వర్తించడం లేదని కార్యకర్తలు, హెల్పర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం అంగన్ వాడీ కార్యకర్తలను హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సాధికార సర్వే నిర్వహించారు. అప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులు అని ఆశపడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించలేదు.

అమలు కాని ఎన్నికల హామీలు

ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అన్ని వర్తింప చేస్తామని హామీల వరాల జల్లు కురిపించారు. దీంతో అంగన్‌వాడీ సెంటర్లకు ప్రభుత్వం అందించే పథకాలు ఏమీ అందలేదు. దీంతో తిరిగి యూనియన్ల సహకారంతో తమ డిమాండ్లను ప్రభుత్వానికి విన్నవించారు. వాటిలో ప్రధానమైనవి కొన్ని.

- అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్లు ఇప్పించాలి.
- ఒంటరి మహిళ పెన్షన్ , వితంతు పెన్షన్ వికలాంగుల పెన్షన్
- అర్హులైన వారికి రేషన్ కార్డులు
- అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల కుటుంబంలో 60 సంవత్సరాల పైబడిన వారికి వృద్ధాప్య పెన్షన్ ఇప్పించాలి.
- అంగన్‌వాడీ కుటుంబ సభ్యులపై గ్యాస్ కనెక్షన్ ఉంటే వారికి గ్యాస్ సబ్సిడీ ఇప్పించాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అందించే వృత్తిపరమైన కార్పొరేషన్ సబ్సిడీలు ఇప్పించాలి..

వీటిని అమలు పరచి వర్తింపచేయాలని ప్రభుత్వానికి గళం వినిపించారు. అయితే ఇంతవరకు ఎలాంటి న్యాయపరమైన కోర్కెలను నెరవేర్చలేదని ఉద్యోగ సంఘాలు వాపోతున్నాయి.

ప్రభుత్వ ఉద్యోగులు పదం తొలగించాలి

గత ప్రభుత్వం సాధికార సర్వేలో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా పేర్కొన్నారు. అందువల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులయ్యారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వ ఉద్యోగులు అనే ఇంకా చూపిస్తోంది. అంగన్‌వాడీ వర్కర్లు , హెల్పర్లు, మినీ హెల్పర్లు ప్రభుత్వ ఉద్యోగులు అని సాఫ్ట్‌వేర్‌లో వున్న పదం తొలగించి అంగన్‌వాడీలకు ప్రభుత్వ పథకాలు వర్తింప జేయాలి.

- విజయ, సిఐటియు అధ్యక్షురాలు, కార్వేటినగరం ప్రాజెక్టు.

ఎన్నికల హామీలు వెంటనే అమలు చేయాలి

అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి. గతంలో 42 రోజులు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సమ్మె నిర్వహించిన సమయంలో అప్పటి ప్రతిపక్షం, ఇప్పటి కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మీ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. వీటిని అమలు చేయాలని యూనియన్ల ద్వారా పలుమార్లు నిరసన ద్వారా తెలుపుతున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చడంలేదు. మా న్యాయపరమైన డిమాండ్లతో పాటు సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి.

- మమత, సిఐటియు ప్రధాన కార్యదర్శి, కార్వేటినగరం ప్రాజెక్టు.

మెయిన్ సెంటర్లుగా మార్చాలి

ఇప్పటి కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె నిర్వహించే రోజుల్లో ప్రతి పక్షంగా ఉన్నప్పుడు మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని హామీ ఇచ్చింది. కార్వేటినగరం ఐసిడిసి ప్రాజెక్ట్ పరిధిలో 40 మినీ అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. ఈ 40 మినీ అంగన్‌వాడీ సెంటర్ లను మెయిన్ సెంటర్లుగా మార్చి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను ఆదుకోవాలి. సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.

- చంద్రకళ, బసివిరెడ్డి మినీ అంగన్‌వాడీ కేంద్రం, ఎస్ఆర్‌పురం మండలం.

పని ఒత్తిడి పెరుగుతోంది.. వేతనాలు పెంచరా?

అంగన్‌వాడీ కార్యకర్తలకు పని ఒత్తిడి పెరుగుతుందే తప్ప వేతనాలు పెంచే పరిస్థితి మాత్రం లేదు. అంగన్‌వాడీ వర్కర్లు , హెల్పర్లకు యాప్‌ల పని భారం అధికం అవుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో యాప్ ల నిర్వహణతో సతమతమవుతున్నారు. ఆన్‌లైన్ పని భారాలు తగ్గించి సాంకేతిక లోపాలు పరిష్కరించి అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై సంబంధిత అధికారులు స్పందించాలి.

- రెడ్డమ్మ , యూనియన్ ఎస్ఆర్‌పురం మండల కోశాధికారి.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

గతంలో సాధికారత సర్వేలో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా చూపించడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందడం లేదు. ప్రభుత్వం కేవలం స్కీం వర్కర్లుగా చూస్తూనే వేతనాలు కాకుండా గౌరవేతనం మాత్రం ఇస్తున్నారు. గౌరవ వేతనం ఇస్తున్న అందరికి సంక్షేమ పథకాలు వర్తించాలని ప్రభుత్వం జీవో కూడా విడుదల చేసింది. అయినా స్కీమ్ వర్కర్లకు ప్రయోజనం లేకుండా పోయింది. సచివాలయాల్లో పించన్ల కోసం, రేషన్ కార్డులు కోసం రకరకాల వాటికి అప్లై చేస్తే ప్రభుత్వ ఉద్యోగులని చూపిస్తోంది.. అందువల్ల వారికి పథకాలు వర్తించడం లేదు. ప్రభుత్వం వీరిని ఉద్యోగులుగా అయినా గుర్తించాలి. లేకపోతే ప్రభుత్వ ఉద్యోగులు అనే పదం తొలగించి పథకాలు అమలు చేయాలి.

- వాడ గంగరాజు, అంగన్‌వాడీ యూనియన్ గౌరవాధ్యక్షులు.

డైయింగ్ యూనిట్ల సంగతి తేల్చండి?

- సమ్మర్ స్టోరేజ్ ప్లాంటు మరమ్మతులు చేపట్టరా?
- మున్సిపల్ కౌన్సిలర్ల ధ్వజం
- పైపులైన్లు మూసేస్తామన్న కమిషనర్

ప్రజాశక్తి -విజయపురం (నగరి): ఆరు డైయింగ్ యూనిట్లు ఏ రికార్డులతో తెరచుకుందో తేల్చాలని అధికారులను మున్సిపల్ కౌన్సిలర్లు నిలదీశారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఛైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన మున్సిపల్ సమావేశం నిర్వహించారు. కమిషనర్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది అజెండాను వినిపించారు. అజెండాలోని అంశాలకు ఆమోదం తెలిపిన అనంతరం కౌన్సిలర్లు మాట్లా డుతూ ప్రతి నెల ఘోషిస్తున్నా హానికర రసాయన రంగునీటి సమస్యకు పరిష్కారం లభించడం లేదన్నారు. అన్నీ సక్రమంగా ఉన్నాయంటూ అధికారులు ఆరు డైయింగ్ యూనిట్లకు మాత్రమే అనుమతులు ఇవ్వడం అయినా కాలువల్లో రసాయన నీరు ప్రవహించడంపై అధికారులను ప్రశ్నించారు. ఏ ప్రాతిపదికన ఆరు డైయింగ్ యూనిట్లకు అనుమతు లిచ్చారో ఆ రికార్డులు కౌన్సిల్‌కు ఒక కాపీ ఇవ్వాలని కౌన్సిలర్ బీడీ భాస్కర్ మున్సిపల్ కమిషనర్, డీఈలను కోరారు. రికార్డులు అందిస్తామని అధికారులు కౌన్సిల్‌కు హామీ ఇచ్చారు. కౌన్సిలర్ దయానిధి, ఇంద్రయ్య మాట్లాడుతూ డైయింగ్ యూనిట్ల వారి కోసం ఈటీపీ మరమ్మతులకు కలెక్టర్‌కు విన్న వించుకొని నిధులు మంజూరు చేసుకున్న అధికారులు, ప్రజలకు తాగునీరు అందించే సమ్మర్ స్టోరేజ్ ప్లాంట్ మరమ్మతులకు ఎందుకు నిధులు మంజూరు చేసుకోలేక పోతున్నారన్నారని నిలదీశారు. దీనిపై డీఈ మాట్లాడుతూ ప్లాంటులో ట్యూబర్ సమస్య ఉందని దారి మరమ్మతులకు రూ.18 లక్షలు అవుతుందని 15వ ఫైనాన్స్ నిధులతో వాటిని చేసుకునేందుకు అనుమతులు కావాలంటూ టేబుల్ అజెండా ఉంచారు. దీనిపై ఛైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఎన్ని బోర్లు జాతీయ రహదారి విస్తరణలో పోతుంది. ఎన్ని మరమ్మతులకు గురైందనే వివరాలు స్పష్టంగా అందిస్తే అనుమతులు ఇస్తామన్నారు. వైస్‌ఛైర్మన్ వెంకటరత్నం మాట్లాడుతూ వార్డుల్లో కౌన్సిలర్లుకు తెలియకుండా పనులు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ వార్డుల్లో జరిగే పనులు కౌన్సిలర్లకు తప్పక తెలపాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

చిత్తూరు ప్రభుత్వాస్పత్రి పరిరక్షణకు ప్రజా పోరాటం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని అపోలో యాజమాన్యానికి అప్పగించడానికి సాగుతున్న కుట్రను ప్రజలందరూ సంఘటితంగా ఎదుర్కోవాలని ప్రభుత్వ ఆసుపత్రి సంరక్షణ , పోరాట కమిటీ పిలుపు నిచ్చింది. శుక్రవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్తూరు కోపరేటివ్ బ్యాంక్ మాజీ ఛైర్మన్, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి సంరక్షణ, పోరాట కమిటీ కోఆర్డినేటర్ పి షణ్ముగం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి అపోలో యాజమాన్యానికి అప్పగించడానికి జరుగుతున్న కుట్రను సమర్థవంతంగా ప్రజలందరూ సంఘటితంగా ఎదుర్కోవాని కోరారు. శుక్రవారం చిత్తూరు బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర కలిగి కోట్లాది రూపాయల విలువైన ఆస్తిని చిత్తూరు జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్న మంచి ఉద్దేశంతో ఆనాడు ప్రభుత్వం అపోలో యాజమాన్యానికి అప్పగిస్తే ఒప్పందాలకు వ్యతిరేకంగా అపోలో మెడికల్ కాలేజీ నడుపుతూ కోట్లాది రూపాయలకు గడిస్తూ వ్యాపార సంస్థగా మారిందన్నారు. పేద ప్రజల జీవితాలతో ప్రాణాలతో చెలగాటం మాడుతున్న అపోలో యాజమాన్యాన్ని చిత్తూరు నుండి తరిమి కొట్టాలని గత రెండు నెలలుగా తాము పోరాటం చేస్తున్నామన్నారు. దీనిపై జూన్ 3,2025 విచారణకు వస్తున్న కమిటీ ముందు ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితిని వివరించాలని కోరారు. కమిటీ ప్రజలకు వ్యతిరేకంగా ఇస్తే ప్రజా పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి సంరక్షణ, పోరాట కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎన్ హెచ్ ఆర్ సి జాతీయ కార్యదర్శి శోభారాణి, కుమరేసన్, సాదిక్ పాల్గొన్నారు.

ఒకరోజు ముందే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత ఫింఛన్‌లకు సంబంధించి జూన్ నెల పెన్షన్లు ఒకరోజు ముందే మే 31న లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు మే 31 వ తేదీ ఉదయం 6.30 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దే పంపిణీ చేయాలని, అదే రోజు 100 శాతం పూర్తి చేయాలని ఎంపిడిఓ లు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. 2,63,776 మంది ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత ఫింఛన్ దారులకు రూ.112.73 కోట్ల పంపిణీ చేస్తామని తెలిపారు. మే 31 వ తేదీన పంపిణీ చేయని పింఛనుదారులకు జూన్ 2వ తేదీ మధ్యాహ్నం 2.గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ,వార్డు సచివాలయంలో సంబంధిత సచివాలయ సిబ్బంది పంపిణీ చేయాలని ఆదేశించారు.

మలేరియా వారోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో అర్బన్ హెల్త్ సెంటర్ కాజూరు పరిధిలోని జానకారపల్లె సచివాలయం ఏరియాలో ఫ్రైడే డ్రైడే ను శుక్రవారం తనిఖీ చేశారు. జూన్ ఒకటవ తేది నుండి జూన్ 30 వ తేది వరకు మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహించనున్న సందర్భంగా ర్యాలీ నిర్వహించి దోమలు వల్ల మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధి మొదలగు జ్వరాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ , సబ్ యూనిట్ ఆఫీసర్స్ రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, నారాయణ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారా మెడికల్ ఆఫీసర్‌కు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పారా మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న రవికుమార్‌కు వీడ్కోలు సమావేశం శుక్రవారం స్థానిక మురకం బట్టులోని కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉద్యోగ విరమణ పొందుతున్న రవికుమార్ అభినందించారు. రవికుమార్‌ను వైద్య ఆరోగ్యశాఖ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పుష్పమాలతో సన్మానించారు.

ఎయిర్ పోర్ట్ బాధిత రైతులకు అండ

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల్ రాజు

ప్రజాశక్తి- శాంతిపురం : కుప్పం నియోజకవర్గం శాంతిపురం, రామకుప్పం మండలాల్లో పేద రైతుల నుండి 1.137 ఎకరాల ఎయిర్‌పోర్టు గ్రీన్ ఫీల్డ్ పేరుతో బలవంతంగా ప్రభుత్వం లాక్కుందని, భూసేకరణను వ్యతిరేకిస్తున్న రైతులకు అండగా వుంటామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హంగేరి ఓబులరాజు పేర్కొన్నారు. భూములు కోల్పోతున్న ప్రాంతాలలో శుక్రవారం ఆయన పర్యటించి రైతులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. 2013 భూ సేకరణ చట్టానికి వ్యతిరేకంగా, బలవంతంగా బెదిరించి భూములను లాక్కునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇలాంటి చట్ట వ్యతిరేక పనులను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. స్థానిక అధికారులు, జిల్లా యంత్రాంగం చట్టానికి లోబడి పని చేయాలి తప్ప అధినాయకుల మన్ననలకోసం కాదని హితవు పలికారు. ఎకరానికి 16 లక్షలు రూపాయలు పరిహారం ప్రభుత్వం నిర్ణయించిందని బుద్ధిగా తమ భూములను స్వాధీనం చేసిన వారికి 16 లక్షల రూపాయలు చెల్లిస్తామని అలా కాదని ఎవరైనా కోర్టుకు వెళితే అలాంటి వారికి ఎకరానికి 10 లక్షల రూపాయలు మాత్రమే కోర్టులో చెల్లించి భూములను స్వాధీనం చేసుకుంటామని అధికారులు బెదిరిస్తున్నట్లు కొంతమంది రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ధిక్కరించిన వారికి అధికారికంగా తమ నుండి ఎలాంటి సహాయ సహకారాలు భవిష్యత్తులో ఉండబోదని అధికారులు రైతులను బెదిరించడం చాలా దారుణం అన్నారు. అవసరానికి మించి భూసేకరణ చేపట్టి రైతులను నిరాశ్రయులుగా చేసి వారి కడుపు కొట్టడం మంచిది కాదన్నారు. రామకుప్పం మండలం విజలాపురం, కిలాకి పోడు , మనింద్రం, అంకిరెడ్డిపల్లి కడసిన కుప్పం, శాంతిపురం మండలం దండి కుప్పం, అమ్మవారి పేట , సొన్నెగాని పల్లి, గ్రామాల నుండి 1136.955 ఎకరాలు అందులో వెయ్యి ఎకరాలకు పైగా సంవత్సరానికి మూడు పంటలు పండే సారవంతమైన నీటి వసతి కలిగిన భూములు ఇలాంటి భూములను రైతుల నుండి బలవంతంగా తీసుకోకూడదని 2013 భూ సేకరణ చట్టం చెబుతున్నప్పటికీ అధికారులు ఈ చట్టానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రైతులకు న్యాయం జరగకపోతే ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు చక్రపాణి, జై కుమార్ రేపు గౌడు, సోమశేఖర్, పెద్దన్న, మురుగేష్ పాల్గొన్నారు.

బాధిత రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు.11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఉత్సవాలలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రీ మెగా యోగా కార్యక్రమం శుక్రవారం ఉదయం స్థానిక పోలీసు శిక్షణ మైదానంలో 4 వేల మందితో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా అటవీ శాఖ అధికారిణి భరణి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ సుధారాణి ముఖ్య అతిథిదులుగా హాజరై కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవు తుందన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ.కె.మోహన్ కుమార్, ఆర్డీఓ భవాని, జెడ్‌పి సిఈఓ రవి కుమార్ నాయుడు, సిపిఓ సాంబశివ రెడ్డి, ఉద్యాన శాఖ డి డి మధుసూదన్ రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి గౌరి,జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి, మెప్మా పీడీ రాధమ్మ, డ్వామా ఏ పీడీ మల్లిఖార్జున, తదితరులు పాల్గొన్నారు.

మహానాడులో మండల వాసి అదృశ్యం

ప్రజాశక్తి- రామకుప్పం: కడప జిల్లాలో నిర్వహించిన టిడిపి మహానాడు సభకు రామకుప్పం మండలవాసి వెళ్లి అదృశ్య మయ్యాడు. మండలంలోని సింగ సముద్రం పంచాయతీకి చెందిన సుబ్బన్న అలియాస్ (తిప్పన్న) మహానాడుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో దారి తెలియక అదృశ్యమయాడని తెలిపారు. సుబ్బన్న మహానాడుకు హాజరైనట్లు మండల వాసులు తెలిపారు. అతని ఆచూకీ తెలిసినవారు ఎస్ఐ వెంకట మోహన్ 9440900703, ఏఎస్ఐ 9490586751 రెడ్డి శేఖర్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

సుబ్బన్న అలియాస్ (తిప్పన్న)

రెండో పెళ్లి చేసుకున్న భర్తకు జైలు శిక్ష

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: రెండో పెళ్లి చేసుకున్న భర్తకు ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించిన సంఘటన శుక్రవారం జిల్లా కోర్టులో జడ్జి ఉమాదేవి తీర్పు ఇచ్చారని సిఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బంగారు పాలెం మండలం సదకుప్పం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు హేమంత్ కుమార్‌కు తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా డిచ్పపల్లి గ్రామానికి చెందిన విజయతో 2016లో వివాహమైంది. అప్పటి నుండి తవణంపల్లి మండలంలో నివాసిస్తున్నారు. 2020లో విజయకు తెలియకుండా మరో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. దీనిపై మొదటి భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారించారు. శుక్రవారం చిత్తూరు పి జె సి జె సి యు ఎం జె ఎఫ్‌సిఎం కోర్టు విచారణలో హేమంత్ కుమార్ కి ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ జడ్జి ఉమాదేవి తీర్పు ఇచ్చారు. ఈ కేసు ఏపిపి ఉమాదేవి బాధితులకు తగు న్యాయం చేసే విధంగా వాదనలు వినిపించి శిక్ష ఖరారు చేశారు. ఈ కేసులో సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పరిచిన హెడ్ కానిస్టేబుల్ సామ్రాజ్‌ను బంగారుపాళ్యం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు అభినందించారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పలమనేరు: ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి అధికారులకు సూచించారు. పలమనేరు పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ, మున్సిపల్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల అంశంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గంటావూరు కాలనీలో గుర్తించిన ఇంటి స్థలాల అంశంపై వివరాలు అడిగి తెలుసుకుని త్వరలో అర్హులైన పేదలను గుర్తించి నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని తహశీల్దారు ఇన్బనాథన్‌ను ఆదేశించారు. ఇక పట్టణంలోని మదనపల్లి రోడ్డులో డివైడర్ ఏర్పాటుతో పాటు గత టిడిపి ప్రభుత్వ హయాంలో మంజూరైన విద్యుత్ దీపాల ఏర్పాటు పై కమిషనర్ ఎన్‌వి రమణా రెడ్డి ని అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ స్తంభాలతో పాటు మెటీరియల్ సిద్ధంగా ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ జాప్యం చేస్తున్నారని కమిషనర్ వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఎన్.హెచ్ ఉన్నతాధికా రులకు ఫోన్ చేసి వెంటనే డివైడర్ ఏర్పాటుతో పాటు విద్యుత్ స్తంభాలు ఏర్పాటయ్యేలా మున్సిపల్ అధికారు లతో సమన్వయం చేసుకొని పనులు పూర్తి చేయాలన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో నుంచి మార్కెట్ కమిటీ వరకు ఇదే పనులు పెండింగ్ ఉన్నాయని అందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. పలమనేరులో ఈ మధ్య కురిసిన వర్షాలకు భూగర్భ జలాలు పెరగడంతో తాగునీటి సమస్య తీరినట్టేనని కమిషనర్ ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు కేటీల్ ఫామ్ సమీపంలో ఏర్పాటు చేయాలనుకున్న అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ పనులపై ఏఎంసి సెక్రటరీ వి. సంజీవ్ కుమార్ తో ఆయన సమావేశమై చర్చించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొలతల్లో తేడాలు వస్తే చర్యలు

- తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్

ప్రజాశక్తి-సోమల: తూనికల కొలతల్లో తేడాలు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ నాగరాజు హెచ్చరించారు. మండల కేంద్రమైన సోమల తహశీల్దార్ కార్యాలయం వద్ద అన్నమయ్య జిల్లా రాయచోటి తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో చౌక దుకాణ డీలర్ల తూనిక యంత్రాలు, ఈ పాస్ మిషన్ల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఎన్‌డియు వాహనాలు ప్రభుత్వం రద్దు చేయడంతో జూన్ ఒకటవ తేదీ నుండి చౌక దుకాణాల వద్ద నిత్యావసర సరుకులు డీలర్లు అందజేయాల్సి ఉంటుందని కార్డుదారులకు అందించే సరుకుల తూకాలలో ఎలాంటి అవకతవకలు జరిగినా తమ దృష్టికి వచ్చినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సోమల మండలంలో 33 చౌక దుకాణాలకు సంబంధించిన తూనిక యంత్రాలు సదుం మండలంలో 38 చౌక దుకాణాలకు సంబంధిం చిన తూనిక యంత్రాలు తనిఖీ చేశామని తెలిపారు.

వేరుశనగ సాగుకు రైతులు సిద్ధం

- రైతేసేవా కేంద్రాలకు విత్తనాలు
- 30 కేజీల బస్తా రూ.1674

ప్రజాశక్తి- పుంగనూరు: ఖరీఫ్ పంట వర్షంపై ఆధారపడి రుతు పవనాల రాక నుంచి రుతుపవనాల తిరోగమనం వరకు పండించే పంటలని చెప్పవచ్చు. మొక్కలు నాటడం, సాగు చేయడం, నూర్పిళ్ల అన్ని ఈ ఖరీఫ్ లోనే జరుగుతాయి. శరదృతువులో కోతకు వచ్చే ఇలాంటి పంటలను రుతుపవన పంట అని కూడా పిలుస్తారు. పుంగనూరు వ్యవసాయ శాఖ డివిజన్ లోని మండలాలలో వర్షాధారంపై ఆధారపడి ఇక్కడ మెట్ట భూముల్లో రైతులు ఖరీఫ్ సీజన్లో ఎక్కువగా వేరుశనగ సాగు చేస్తుంటారు. నైరుతి రుతుపవనాలు ముందుగానే పలుకరించడంతో అక్కడక్కడ మోస్తరు పరిధిలో వర్షాలు పలుకరిస్తున్నాయి. దీంతో రైతులు దుక్కులు దున్నే కాల పనుల్లో నిమగ్నమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాలకు వేరుశనగ విత్తనాలు తరలించి నిల్వ చేస్తున్నారు. ఇప్పటివరకు 70 శాతం వరకు విత్తనాలను నిల్వ చేసి ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. 30 కేజీలు వేరుశనగకాయల బస్తా రూ 2790 గాను ప్రభుత్వ రాయితీ రూ.1,116 లు పోను రూ.1,674 లకు ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. పుంగనూరు వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో పుంగనూరు, చౌడేపల్లి, సోమల, పులిచెర్ల, రొంపిచర్ల,పెద్దపంజాణి, గంగవరం 8 మండలాల పరిధిలో గత ఏడాది 3,436 హెక్టార్లలో మాత్రమే (8590 ఎకరాలు) వేరుశనగ సాగు చేశారు. సాగుకు మాత్రం7,068 క్వింటాళ్ల వేరుశనగ అవసరం ఉంటుంది. అయితే12,200 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు రైతులు తీసుకున్నారు. ఒక హెక్టారు 2.5 ఎకరాకు ఐదుమూటలు వేరుశనగ బస్తాలు అవసరం ఉంటుంది. అయితే ఈ ఏడాది గత రెండు సంవత్సరాలుగా సాగుచేసిన విస్తీర్ణాన్ని బట్టి 7,949 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మాత్రమే ఎనిమిది మండలాలకు కేటాయించినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. వ్యవసాయ శాఖ సేకరించిన సమాచారం మేరకే విత్తనాలను పంపిణీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

వేరుశనగ సాగు చేసే భూముల్లో ముందుగానే పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయ శాఖ 50 శాతం రాయితీతో రైతుసేవా కేంద్రాలకు పంపిణీ చేశారు. జనుము, జిలుగు తదితర విత్తనాలను సరఫరా చేసింది. దున్నకాల ముందు భూమిలో వీటిని కలియ దున్నితే భూమిలో సత్తువ పెరిగి మంచి దిగుబడి పెరగడానికి ఇది దోహదపడుతుంది.

తీసుకున్న ప్రతి రైతు సాగు చేయాలి

రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించే వేరుశనగ విత్తనాలు ప్రతి ఒక్కరూ సాగు చేయాలి. రెండు సంవత్సరాలుగా రైతులు వేరుశనగ విత్తనాలు తీసుకున్న దానికన్నా సాగు తక్కువగా చేశారు. ఏడాది బయోమెట్రిక్ ద్వారా వేరుశనక్కాయల విత్తనాలు పంపిణీ చేస్తాం..

తీసుకున్న విత్తనాలను సాగుకు ఉపయోగించకుండా అమ్మకాలు చేస్తే అలాంటి వారికి వ్యవసాయ శాఖ నుండి ప్రభుత్వం అందించే పథకాలు ఏవి వర్తించవు. వేరుశనక్కాయలు కిలో 93 రూపాయలు ప్రకారం ప్రభుత్వ రాయితీ 40 శాతం పోను రైతులకు అందిస్తాం..

- శివ కుమార్, పుంగనూరు వ్యవసాయ శాఖ ఏడిఏ.

వైభవంగా ధ్వజారోహణం

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం పుల్లూరు క్రాస్ రోడ్‌లోని శ్రీ ధర్మరాజు గుడి వద్ద మొదటి రోజు శుక్రవారం ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయం ధ్వజారోహణం శనివారం నిర్వహించారు. సింధు రాజపురం ఆలయ పురోహితులు హరిహరన్ గణపతి పూజ, యజ్ఞ పూజలు, ఆలయ కమిటీ సభ్యుల పరిసర ప్రాంత గ్రామ పెద్దలు, భక్తులతో కలిసి నిర్వహించారు. ఉభయదారులు గా భారతి సుబ్బారాయుడు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వేణు నాయుడు, రాజశేఖర్ నాయుడు, నారాయణస్వామి నాయుడు, ఎత్తు రాజుల నాయుడు, కేశవులునాయుడు, సుదర్శన్ నాయుడు, సుబ్రహ్మణ నాయుడు, మాధవ నాయుడు, బ్రహ్మనాయుడు, గోవర్ధన్ మందడి, స్థానిక సర్పంచ్ హరిత కుప్పయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలసిన డిసిసిబి చైర్మన్

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న డిసిసిబి చైర్మన్

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని చిత్తూరు జిల్లా కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి మర్యాద పూర్వకంగా శుక్రవారం కలసి సన్మానించారు. డిసిసిబీ చైర్మన్ గా నియమితులు కావడంతో ఆయన సీఈవో సి.శంకర్ బాబుతో కలసి శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో అమరనాథ రెడ్డిని కలసి ధన్యవాదాలు తెలియజేస్తూ పుష్పగుచ్చం అందించి శాలువాలతో సత్కరించారు. త్వరలో జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విచ్చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సిబ్బంది గంగిరెడ్డి,యువశేఖర్, హరి ప్రసాద్, టీడీపీ పార్లమెంటరి యువత సెక్రటరీ ఢిల్లీబాబు పాల్గొన్నారు.

నేడు సామాజిక పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి -సోమల: సోమల మండలంలో శనివారం సామాజిక పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో నారాయణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం7,131 మందికి పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 7 గంటల నుండి ప్రారంభం అవుతుందని పింఛనుదారులు ఎక్కడ ఉన్న వారి స్వస్థలాలకు చేరుకొని పింఛన్లు తీసుకోవాలని సిబ్బందికి సహకరించాలని కోరారు. జూన్ మాసం ఒకటవ తేదీ ఆదివారం కావడం వల్ల మే 31వ తేదీనే పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశంతో శనివారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

కేంద్ర సహాయ మంత్రికి వినతి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : కేంద్ర సహాయ మంత్రి ఎల్ మురుగన్ శుక్రవారం తిరు మ లకు విచ్చేసిన సంద ర్భం గా మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. జాతీయ కౌన్సిల్ సభ్యుడు రాజేంద్రన్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులతో కలసి శుక్రవారం వినతిపత్రం అందించారు. తిరుపతిలో జిఎంఆర్ అతిథి గృహంలో రాజేంద్రన్ ఆధ్వర్యంలో కేంద్ర సహాయ మంత్రి మురుగన్ ను కలిసి జిల్లాలో ఉన్న దళితుల సమస్యలను కేంద్ర మంత్రికి వివరించారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు . ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యుడు రాజేంద్రన్ , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చౌక దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి -సోమల: సోమల మండలంలోని చౌక దుకాణాలను తహశీల్దార్ బెన్ను రాజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టరు, లైసెన్స్ నామిని ఆథరైజేషన్ తదితర అంశాలను తనిఖీ చేసి ప్రభుత్వం అందించిన యాప్ లో నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. నిత్యావసర సరుకులు పంపిణీ చేసేటప్పుడు తూకాలలో ఎలాంటి మోసం లేకుండా ఖచ్చితమైన తూకాలు వేసి ప్రజలకు నిత్యావసర సరుకులు ఇవ్వాలని చౌక దుకాణాల వద్ద బోర్డు ఏర్పాటు చేసి అందులో సరుకుల వివరాలు దుకాణదారుడు పేరు లైసెన్స్ వివరాలను నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆదేశం ప్రకారం జూన్ 1వ తేదీ నుండి చౌక దుకాణాల వద్ద నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని కార్డుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిటి మధుసూదన్ రెడ్డి, చౌక దుకాణ డీలర్లు పాల్గొన్నారు.

మొగిలి ఆలయ హుండీ ఆదాయం రూ. 3,69,335

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: శ్రీ కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి ఆలయ ఉండి 3,69,335 రూపాయలు ఆదాయం వచ్చినట్టు ఆలయ పర్యవేక్షణ అధికారి సుమన ప్రియ తెలిపారు. శుక్రవారం మండలంలోని మొగిలి గ్రామంలోని శ్రీ కామాక్షి సమేత మొగిలి శ్వర స్వామి ఆలయంలో ఉండి లెక్కింపు కార్యక్రమం ఆలయ కార్య నిర్వహణ అధికారి ముని రాజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నగదును ఆలయ బ్యాంక్ ఖాతాలోకి జమ చేసి ఆలయ అభివృద్ధికి ఖర్చులు ఉంచినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వంశపార ధర్మకర్త విజయ్ కుమార్ ఆలయ సిబ్బంది శరవణ కుమార్, మధు, బాలాజీ భక్తులు ధనంజయ, ప్రసాద్ , మంజునాథ్ పాల్గొన్నారు.

దేశ రాజకీయాల్లో జనసేన కీలకం

- డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి -పుంగనూరు: జనసేన వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ దేశ రాజకీ యా లలో కీలకం కాబో తున్నారని నియో జక వర్గ జనసేన నాయకులు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వారికి చదళ్ల గ్రామం చౌడేశ్వరి కళ్యాణ మండపం ఆవరణంలో శుక్రవారం సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు చెప్పారు. క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వారికి కిట్లతోపాటు ఐడి కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో దేశ రాజకీయాలలో పవన్ కళ్యాణ్ కీలకంగా వ్యవహరిస్తారని అలాంటి సభ్యత్వం తీసుకోవడం అదృష్టం గా భావించాలని చెప్పారు. క్రియాశీలక సభ్యత్వాలు చేసిన పలువురిని సత్కరించారు .ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శివ కుమార్ రెడ్డి, గాజుల నరేష్, విరూపాక్షి , చైతన్య రాయల్, పాముల హరి, నరేంద్ర రెడ్డి, నారాయణ రెడ్డి, హరి నాయక్,బాలాజీ నాయక్,నాగభూషణం, చరణ్, జావేద్, నందు, జి. చంద్ర, సుబ్బు, హరి నారాయణ, రఘు, ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

పార్టీ నమోదు సభ్యత్వ పత్రం అందిస్తున్న నాయకులు

దళిత యువకుడిపై దాడి అమానుషం

కెవిపిఎస్ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు
రౌండు టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి- పలమనేరు: దళిత, మైనార్టీ యువకులపై నడిరోడ్డుపై అత్యంత దారుణంగా పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషమని, వారిని తక్షణమే విధుల నుండి తొలగించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండు చేశారు. పలమనేరులో కెవిపిఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. అనంతరం మీడియాతో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అన్నూరు ఈశ్వర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు మాట్లాడుతూ తెనాలి అయితానగర్‌లో జరిగిన ఘటనను సుమోటాగా తీసుకొని కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఏ కేసులోనైనా నిందితులకు శిక్షలు అమలు చేసే అధికారం కోర్టు పరిధిలో అంశమని, దాన్ని ఉల్లంఘించి పోలీసులు లాఠీలతో నిందితులపై దాడి చేయడం మానవ హక్కుల ఉల్లంఘనే అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. విజిలెన్స్ మానిటరీ కమిటీ సమావేశాలు సీఎం, మంత్రులు, కలెక్టర్ల స్థాయి వరకు జరగడంలేదని విమర్శించారు. సంవత్సరానికి నాలుగు సార్లు జరగాల్సి ఉండగా గత వైసిపి ప్రభుత్వం లోను, టిడిపి కూటమి ప్రభుత్వంలోనూ జరగలేదన్నారు. దీన్నిబట్టి దళిత, గిరిజనులపై పాలకులకు ఉన్న శ్రద్ధ ఏమిటో అర్థం అవతుందన్నారు. ఇప్పటికైనా సమావేశాలు జరిపి, రాష్ట్రవ్యాప్తంగా దళిత, గిరిజన, మైనార్టీలపై జరిగే దాడులను అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు విచక్షణారహితంగా కొట్టడమే కాకుండా రౌడీ షీట్ ఓపెన్ చేయడం దారుణమని అన్నారు. ప్రభుత్వ స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా దళిత, గిరిజన, మైనార్టీ సంఘాలతో ఆందోళన తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులే అతిక్రమించారని ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి అన్నారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుని, పోలీసులు దళిత యువకులపై దాడి చేయడం సమాజానికే అత్యంత ప్రమాదకరమన్నారు. న్యాయవ్యవస్థ చేయాల్సిన పనిని పోలీసులు అమలు చేయడాన్ని ఐద్వా సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇలాంటి ఘటనలపై పౌర సమాజం కూడా స్పందించా లన్నారు. సామాజిక వర్గాలకు అనుకూలంగా పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ నాయకులు రాము, మని , కవిత పాల్గొన్నారు.

కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడికి ఘన సన్మానం

ప్రజాశక్తి - రామకుప్పం: కుప్పం నియోజకవర్గ అభివృద్ధి అథారిటీ(కడ) రాజకీయ సలహాదారుల కమిటీ సభ్యుడిగా మండలంలోని మద్దనపల్లి గ్రామ పంచాయతీ చెందిన రఘు నియమించటంపై టిడిపి నేతలు మునస్వామి , నారాయణా చారి ,ఆనంద రెడ్డి,ఆంజనేయ రెడ్డి, నరసింహులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఆయనకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. టిడిపిలో కార్యకర్తలు కష్టపడిన వారిని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తించాలన్నారు. ఇలాంటి పదవులు మరెన్నో పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీతాపతి, రామ్మూర్తి, శ్రీనివాసులు రెడ్డి,చిన్న కృష్ణ, కృష్ణా నాయక్, జయశంకర్, మనోహర్, గుర్రప్ప, వెంకటాచలం, శ్రీనాథ్ రెడ్డి, సత్తి, ఆదిల్ల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరు పట్టణ రేషన్ డీలర్లు పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం కలసి సన్మానించారు. ఎండియు, (మొబైల్ డిస్పెన్సరి యూనిట్) వాహనాలను తొలగించి రేషన్ సరుకుల పంపిణిని డీలర్లు చేపట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడాన్ని హర్షిస్తూ ఎమ్మెల్యేను కలసి ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ఏమాత్రం ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం డీలర్లపై నమ్మకానికి అనుగుణంగా పారదర్శకంగా నిత్యావసరాలు పంపిణీ చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘ నాయకులు నరేంద్ర కుమార్, ముని కృష్ణయ్య, సనాఉల్లా, జుబేర్, జిలాని, రాజేష్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి: డిఆర్‌డిఎ పీడీ

ప్రజాశక్తి - యాదమరి: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో గత 45 రోజులుగా మగ్గం వర్క్ లో శిక్షణ పొందిన మహిళలు ఇకపై ఆర్థికంగా ఎదగాలని డిఆర్డిఏ పీడీ శ్రీదేవి కోరారు. వెలుగు కార్యాలయంలో 45 రోజుల పాటు మండలంలోని మహిళలకు మగ్గం వర్క్ పై శిక్షణ తరగతులు డిఆర్డిఏ అధికారులు నిర్వహించారు. శిక్షణ పూర్తి కావడంతో శుక్రవారం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందించారు. అనంతరం డిఆర్డిఏ పీడీ మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలు సొంతంగా మగ్గం వర్క్ సాయంతో ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు, వెలుగు ఏపీఎం పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి సిద్ధంగా ఉండాలి: ఎంపిడివో

ప్రజాశక్తి -వెదురుకుప్పం: పింఛన్ల పంపిణీకి మండల కార్యాలయ సిబ్బంది సిద్ధంగా వుండాలని ఎంపిడివో పురుషోత్తం ఆదేశించారు. వెదురుకుప్పం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ ఎల్ పురుషోత్తం ఆధ్వర్యంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ లచే చివరిదైన మూడవ రోజు సచివాలయ సిబ్బందికి యోగాంధ్ర శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శుక్రవారం యోగా శిక్షకులు త్రిలోక సుందరి, దాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ శనివారం లోపు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మోహన్ కుమార్, మండల పరిషత్తు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పండు ఈగల బుట్టల పంపిణీ

ప్రజాశక్తి -తవణంపల్లి: వర్షాకాలం వచ్చిందంటే ప్రారంభమైన నేపథ్యంలో మామిడి తోటలపై పండు ఈగల దాడులు తీవ్రంగా పెరిగిన సంగతి తెలిసిందే. ఈ దృష్ట్యా తవణంపల్లి, బంగారుపాలెం, ఐరాల మండలాలలోని మామిడి రైతులకు రాయితీపై పండు ఈగ బుట్టలు అందిస్తామని అధికారులు పేర్కొన్నారు. పండు ఈగల వల్ల ఫలాలు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని తవణంపల్లి వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సమస్యను తగ్గించేందుకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ప్రతి బుట్టలో 3 ఉండేలా ఏర్పాటు చేసి, ఒక్కో బుట్టను కేవలం రూ.11కే అందజేస్తున్నట్టు ఆయన చెప్పారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయండి: డిఈఈ

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరు రూరల్, అర్బన్ పరిధిలో వివిధ దశల్లో ఉన్న ఇంటి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని పుంగనూరు, పలమనేరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్వామి దాస్ అన్నారు. రాగానిపల్లి లేఅవుట్లో గోడలు, మోల్డింగ్ దశలో జరుగుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన లబ్ధిదారులతో మాట్లాడుతూ జూన్ నెలలో జరిగే గృహప్రవేశలలో భాగంగా ప్రభుత్వం ఇస్తున్న రూ 1.80లు యూనిట్ కాస్ట్ ను అదనంగా ఎస్సీ, బీసీలకు అందిస్తున్న 50 వేలు, ఎస్టీలకు 75వేలు ప్రభుత్వం అందిస్తుందని దీనిని సద్వినియోగం చేసుకొని అసంపూర్తిగా ఉన్న ఇల్లు పూర్తి చేసుకోవాలన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో మొత్తం 15,410 మంజూరు కాగా11,142 ఇళ్లు పూర్తి చేసుకున్నారన్నారు. వివిధ దశల్లో ఉన్న పునాదులు 1,315, గోడల నిర్మాణంలో 1,664, మోల్డింగ్ నిర్మాణంలో 695 ఇళ్లు ఉన్నాయని వీటిని వెంటనే పూర్తి చేసుకోవాలని కోరారు. నూతన నిర్మాణాలను చేపట్టే లబ్ధిదారులు ఆయా సచివాలయాల పరిధిలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ హేమంత్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేశవాచారి పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండల ఎంపీడీఓ ఎల్ పురుషోత్తం పచ్చికాపల్లం హౌసింగ్ లేఅవుట్ లో నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశ వేడుకకు శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పురుషోత్తం గృహ నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులను అభినందించారు. హౌసింగ్ లేఅవుట్ లో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల ని నిర్మాణాలని పరిశీలించి, మిగిలిన అందరూ గృహనిర్మాణ లబ్ధిదారులు కూడా త్వరితగతిన తదుపరి దశల గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయి భవాని, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సింధూజ, సంక్షేమ మరియు విద్యా సహాయకులు సుదర్శన్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న వెదురుకుప్పం ఎంపిడివో పురుషోత్తం

డాక్టర్ శేఖర్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి -కార్వేటినగరం : డాక్టర్ వి శేఖర్ అదించిన సేవలు అభినందనీయమని మాజీ అడిషనల్ డైరెక్టర్ రెడ్డి ప్రకాష్ అన్నారు. స్థానిక డైట్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన శేఖర్ ఉద్యోగ విరమణ సన్మాన సభకు మాజీ పుత్తూరు డివైఈవో ప్రభాకర్ రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గత 30 సంవత్సరాలుగా వృత్తిలో అంకితభావంతో శేఖర్ పనిచేశారన్నారు. డైట్ లో అధ్యాపకులుగా పుత్తూరు డివైఈవోగా డిప్యూటీ డైరెక్టర్ గా, ఉమ్మడి చిత్తూరు జిల్లా డీఈవోగా , తిరుపతి జిల్లా మొదటి అండ్ డీఈవోగా ప్రస్తుతం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ వి. శేఖర్ విశిష్ట సేవలు అందించి అందరి మన్ననలు పొందారని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా డీఈఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 23 జిల్లాల్లో శేఖర్ దగ్గర చదువుకున్న చాత్రపాధ్యాయులు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఇతర దేశాలలో కూడా ఉపాధ్యాయులుగా స్థిరపడిన వారు ఉన్నారని తెలిపారు. డాక్టర్ గీతా నాథ్ మాట్లాడుతూ అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయులంటే సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. మాజీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ డాక్టర్ శేఖర్ చేసిన సేవలు ప్రశంసనీయమని కార్వేటినగరం డైట్ అంటే ఉపాధ్యాయు లకు పుట్టినిల్లు అన్నారు.

శేఖర్ దంపతులకు సన్మానం

కార్వేటి నగరం డైట్ ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న డాక్టర్ శేఖర్ దంపతులను అధ్యాపకుల బృందం శాలువాలు కమిటీ ఘనంగా సన్మానించారు. తిరుపతి డివైఈవో బాలాజీ, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎండంపల్లి శ్రీనివాసులు రెడ్డి, ఎస్టియు రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు ముత్యాల రెడ్డి ఎస్ ఎస్ నాయుడు వేణుగోపాల్ పి ఆర్ టి యు బాలాజీ గురుమూర్తి, ఆపాస్ గిరి ప్రసాద్ ఎంఈఓ లు విజయ్ కుమార్ మనోజ్ కుమార్ సతీష్ బాలసుబ్రహ్మణ్యం మాజీ ఎంఈఓ లు యుగంధర్ రెడ్డి కేశవులు గాజుల నిర్మల డాక్టర్ కోటేశ్వర్ శంకరయ్య బాబు కిషోర్ కుమారి హెచ్‌ఎంలు ఎంఈఓ లు ఉపాధ్యాయులు తిరుపతి చిత్తూరు జిల్లా నుండి ఆధ్యాపకులు అధిక సంఖ్యలో పాల్గొని సన్మానించారు.

శేఖర్ దంపతులకు పలువురి సత్కారం

ఉద్యోగ విరమణ చేసిన శేఖర్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

50 శాతం రాయతీతో పశువుల దాణ

ప్రజాశక్తి -సోమల: వేసవిలో పశుదాణా కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలో భాగంగా మండలంలోని రైతులకు 50 శాతం రాయితీతో పశువుల దాణా పంపిణీ చేస్తున్నట్లు సోమల పశు వైద్య సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు తెలిపారు. పెద్ద ఉత్తర పల్లెలో పశు వైద్యాధికారిణి చందన ప్రియ ఆధ్వర్యంలో పశువుల దాణా రైతులకు 50 శాతం రాయితీతో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చందన ప్రియ మాట్లాడుతూ మండలానికి 25 మెట్రిక్ టన్నుల దాణ కేటాయించారని 50 కేజీల పశువుల దాణ అసలు ధర బస్తా 1100 రూపాయలని పాడి రైతులకు రాయితీపై555 రూపాయలకే అందజేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం పెద్ద ఉప్పరపల్లి కందూరు నెల్లిమంద రైతు సేవా కేంద్రాలలో పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి ఆలయ మహా కుంభాభిషేకం

ప్రజాశక్తి- ఐరాల: కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయం శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయం జీర్ణోద్ధరణ, అష్టబంధన, మహా సంప్రోక్షణ, మహా కుంభాభిషేకం మహోత్సవం శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాణిపాకం దేవస్థానంలోని శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయం పునర్నిర్మాణానంతరం ఆలయంలో నిర్వహించిన జీర్ణోద్ధరణ, అష్టబంధన, మహా సంప్రోక్షణ, మహా కుంభాభిషేకం కార్యక్రమానికి మూడవ రోజు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిధిగా హాజరై మహా కుంభాభిషేకం మహోత్సవంలో భాగంగా ఆలయంలో వేద పారాయణం, విమాన గోపురంకు ఛాయా స్నపనము, కృమాంగ స్నపనం, లఘు పూర్ణాహుతి, ఆవాహిత దేవతారాధన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంతకముందు శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని ఎమ్మెల్యే మురళీమోహన్ దర్శించి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఆలయ వేద ఆశీర్వాద మండపంలో వేద పండితులు వేద ఆశీస్సులు అందించగా, ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం ఈవో పెంచల కిషోర్, ఐరాల మండల అధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, ఐరాల జెడ్పీటీసీ సుచిత్ర కన్నయ్య నాయుడు, మాజీ కాణిపాకం దేవస్థానం మాజీ చైర్మన్ మణినాయుడు, మాజీ జెడ్పీటీసీ లతా బాబునాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు మరియు నాయకులు, కార్యకర్తలు, కాణిపాకం దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

దళితులకు చట్టాలపై అవగాహన అవసరం: తహశీల్దారు

ప్రజాశక్తి - యాదమరి: మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న నివసిస్తున్న దళితులు తమ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహశీల్దారు పార్థసారథి కోరారు. మానవ హక్కుల పై శుక్రవారం మండలంలోని దాసరా పల్లె ఆంధ్రవాడ గ్రామంలో దళితులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు తమ ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు ముఖ్యంగా గ్రామాలలో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలకు వద్దకు వచ్చి నేరుగా తెలపాలని కోరారు. రెవెన్యూ సంబంధించి ఎలాంటి సమస్యలను స్వయంగా కలిసి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ కానీ తదితర కార్యాలయాల్లో మీకు గ్రామానికి కావలసిన ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలకైనా వచ్చి స్వయంగా అధికారులతో మాట్లాడవచ్చుని వివరించారు ఈ కార్యక్రమంలో సంధ్యారాణి, దళిత నాయకులు చిట్టిబాబు, హేంద్రీ థామస్ పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణ

బైరెడ్డిపల్లి: యోగాంధ్ర కార్యక్రమాలలో భాగంగా మండల స్థాయిలో మూడు రోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ప్రాంగణం, సచివాలయ, పలు ప్రభుత్వ శాఖల సిబ్బందికి యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు బాలాజీ, శాంతి, అమరావతి, ఏపీవో హరినాథ్, ఎం సి ఓ సురేష్ బాబు, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, చంద్రశేఖర్, బాలాజీ, సురేష్ పాల్గొన్నారు.

సోమల: మండల కేంద్రమైన సోమల ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశపు మందిరంలో మూడు రోజులుగా నిర్వహించిన యోగ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. మండలంలోని 15 పంచాయతీల పరిధిలో ఎంపిక చేసిన 117 మంది కి యోగాపై మూడు రోజులపాటు శిక్షణ ఇచ్చారు.

కార్వేటినగరం: యోగాతో శారీరక ఒత్తిడిని నియంత్రించ వచ్చని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో యోగాంధ్రలో భాగంగా ప్రభుత్వ అధికారులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో విద్యావతి, సచివాలయ సిబ్బంది. వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్ : యోగాంధ్ర (మే 21 నుండి జూన్ 21 వరకు) మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం చిత్తూరు ప్రశాంత్ నగర్ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి మెగా యోగా క్యాంపెయిన్ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో యోగా గురువులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ సుమిత్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు,డి సి హెచ్ ఎస్ డా.పద్మిని,సి పి ఓ సాంబ శివా రెడ్డి,సమగ్ర శిక్ష ఏపీసి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

గంజాయి పట్టివేత

నలుగురు వ్యక్తులు

ప్రజాశక్తి- పలమనేరు: ముందస్తు సమాచారంతో గంజాయి అమ్ముతున్న నలుగురు వ్యక్తులను పలమనేరు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. డిఎస్‌పి ప్రభాకర్ కథనం మేరకు.. పలమనేరు మండలం, గంటావూరు ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో నలుగురు వ్యక్తులు కలిసి గంజాయి వ్యాపారం చేస్తున్నారనే సమాచారం అందడంతో పలమనేరు ఎస్‌డిపివో డి ప్రభాకర్ పర్యవేక్షణలో పలమనేరు అర్బన్ ఎస్ఐ స్వర్ణతేజ, పలమనేరు మండల డిప్యూటీ తహశీల్దారు గీతాంజలి, సిబ్బంది స్థలం వద్దకు వెళ్లి చూశారు. అక్కడ నలుగురు వ్యక్తులు అక్రమ రవాణా ద్వారా తెచ్చిన గంజాయి ప్యాకెట్ల ను విక్రయిస్తుండగా వారిని పట్టుకొని విచారించారు. గంగవరం మండలం జె కొత్తపల్లి గ్రామానికి చెందిన పి రాజేంద్ర విశాఖ పట్టణం, చింతలపల్లి గ్రామంలోని సంగ్ లోయ వద్ద నాలుగు కేజీల గంజాయిని రాజు వద్ద కొనుక్కొని వచ్చాడు. మోహన్, పలమనేరు మండలం, సాంబార్ పూర్ గ్రామానికి చెందిన మంజునాథ్, కిషోర్ కుమార్‌లతో కలసి అమ్ముతుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న సుమారు నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు. గంజాయి, లాటరీ టికెట్లు, కర్నాటక మద్యం అమ్మకూడదని అలా విక్రయిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని హెచ్చరించారు. అలాంటి కనిపిస్తే 9440796733, 9440796734 నెంబర్లకు ఫోను చేసి తెలపాలని డిఎస్‌పి డి ప్రభాకర్ తెలిపారు.

గుడిపాలలో

గుడిపాల: గంజాయి స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు గొల్లమడుగు చెక్‌పోస్ట్ వద్ద గంజాయితో ఒక వ్యక్తి ఉన్నారని సమాచారం రావడంతో గుడిపాల తహశీల్దారు జయంతి తో కలిసి ఆ వ్యక్తిని పట్టుకుని విచారించామన్నారు. ఒడిస్సాకు చెందిన అశోక్ దాస్ గాజులపల్లి లోని సాంబా గ్రానైట్ ఫ్యాక్టరీలో సుమారు ఆరు నెలలుగా పనిచేస్తున్నాడు. ఇతను తన సొంత ఊరైన ఒడిస్సాకు వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు ఒక కేజీ గంజాయిని 3 వేల రూపాయలకు కొని ఇక్కడ సుమారు 30 వేలకు అమ్ముకుంటున్నాడని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి -బంగారుపాలెం:

ప్రమాదంలో గాయపడ్డ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని మొగిలి మొగిలి ఘాట్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్ ఇచ్చిన సమాచారం మేరకు గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా బంగారుపాలెం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేపట్టి మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో షిఫ్ట్ ఆపరేటర్ మృతి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి:

కర్ణాటక రోడ్డు ప్రమాదంలో సిఎఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వినోద్ కుమార్ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. విద్యుత్ పుంగనూరు డివిజన్ పలమనేరు సబ్ డివిజన్ బైరెడ్డిపల్లి సెక్షన్ పెద్దాపురం సబ్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న షిఫ్ట్ ఆపరేటర్ వినోద్ కుమార్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బైరెడ్డిపల్లి మండలంలోని విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న అధికారులు, అనధికారులు వినోద్ కుమార్ మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. అతని కుటుంబానికి తోడుగా ఉంటామని ఏఈసిఈఏ జి 3045 యూనియన్ తరపున ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION):: NAGARI.
O.E.P.NO. 5/2023
O.S. No.210/2021
BETWEEN:
K.RAVI ...**Decree holder.**
And:
N VENU RAJU @ VENKATASWAMY RAJU ...**Judgment debtor**
NOTICE TO JUDEGEMENT DEBTOR
Under order 21 Rule 66 and 64 CPC
To,
N Venu Raju @ Venkataswamy Raju, S/O Late N DESINGA RAJU, Nindra village & Mandal, Chittoor Dist. A.P.
Please to take notice that the above case is posted for your appearance on 16-06-2025 before the Hon'ble Junior civil judge court Nagari at 10.30 A.M, either in person or through an your advocate, failed to attend before the court on the said date by you or an advocate, the matter will be decided in your obscene.
By order of court.
P CHIRANJEEVULU, B.A, B.L.,
ADVOCATE, FOR DHR
NAGARI.

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION):: NAGARI.
O.E.P.NO. 75/2024
O.S. No.65/2023
BETWEEN:
GM VISHALAKSHI ...**Decree holder.**
And:
R A SEKHAR ...**Judgment debtor**
NOTICE TO JUDEGEMENT DEBTOR
Under order 21 Rule 34 CPC
To,
R A SEKHAR, S/O Late ARUMUGAM, D.NO 4-176, Ankalamma Koil street, Satharawada, Nagari Municipality, Chittoor Dist. A.P.
Please to take notice that the above case is posted for your appearance on 16-06-2025 before the Hon'ble Junior civil judge court Nagari at 10.30 A.M, either in person or through an your advocate, failed to attend before the court on the said date by you or an advocate, the matter will be decided in your obscene.
By order of court.
P CHIRANJEEVULU, B.A, B.L.,
ADVOCATE, FOR DHR
NAGARI.